ప్రజాశక్తి
బుధవారం 25 డిసెంబరు 2024

జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ నియామకం

శ్రీకాకుళం : జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులుగా పలువురు నియమితులయ్యారు. ఈమేరకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. లావేరు మండలం గురుగుబెల్లికి చెందిన దండాశి రాంబాబు, శ్రీకాకుళం రూరల్ మండలం చింతాడకు చెందిన తోట రాములు, ఆమదాలవలస పట్టణానికి చెందిన తాళాబత్తుల ధనుంజయరావు, శ్రీకాకుళం నగరానికి చెందిన దాసరి తిరుమలరావు, సారవకోట మండలం అలుదుకు చెందిన కళింగపట్నం అప్పన్న నియమితులయ్యారు. టెక్కలి మండలం పాతనౌపడకు చెందిన గేదెల రమణమూర్తి సారవకోట మండలానికి చెందిన వాబ యోగేశ్వరరావు, బూర్జ మండలం యు.వెంకంపేటకు చెందిన బుడుమూరు వెంకట సూర్యనారాయణరాజు తదితరులను కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. వీరంతా రెండేళ్లపాటు విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులుగా కొనసాగుతారు.

సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు

- కేంద్రం నుంచి నిధులు తెస్తాను
- జిల్లా అభివృద్ధి బాధ్యత అధికారులదే
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) చైర్మన్, కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఆయా కేంద్ర ప్రభుత్వ శాఖలతో మాట్లాడి, ప్రత్యేకంగా నిధుల కేటాయింపులు జరిగేలా చూస్తానని చెప్పారు. జిల్లా అభివృద్ధికి కావాల్సిన నిధులు, పనుల గురించి ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానన్నారు. నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. పిఎం ఆవాస్ యోజన, టిడ్కో ఇళ్లు, జలజీవన్ మిషన్, ఉపాధి హామీ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ తదితర శాఖలపై అంశాల వారీగా సమీక్షించారు. ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామాలను అభివృద్ధి చేసి, పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్న నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లా మరింత ప్రగతి సాధించేలా అన్ని శాఖల అధికారులు చొరవ చూపాలన్నారు. 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్ మాట్లాడుతూ ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో జిల్లాలో గతేడాది ఉపాధి హామీ నిధులు రూ.230 కోట్లు వెనక్కి వెళ్లిపోయాయని చెప్పారు. ఇది సరికాదని, ఇకపై అటువంటివి పునరావృతం కారాదన్నారు. ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ నిధులతో ఉద్దానంలో గత ప్రభుత్వం చేపట్టిన మంచినీటి పథకంలో పెద్దఎత్తున నిధుల దుర్వినియోగమైందన్నారు. ఉద్దానం పథకంలో గతంలో పనిచేసిన వారిని తొలగించి అన్యాయం చేశారని, దీనిపై ఒకరోజు ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించాలని కలెక్టర్‌ను కోరారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు కూన రవికుమార్, గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష వారి నియోజకవర్గాల్లో ఎదుర్కొంటున్న పలు సమస్యలపై మాట్లాడారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా, సిపిఒ ప్రసన్నలక్ష్మి, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రెప్పపాటులో ఘోరం

- కరెంటు స్తంభాన్ని ఢీకొట్టిన కారు
- ముగ్గురు దుర్మరణం
- ముగ్గురికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం

ఒక్కగానొక్క కుమార్తెకు పాట్నా ఐఐటిలో సీటు వచ్చినందుకు సోమవారం రాత్రి కుటుంబమంతా విశాఖ బీచ్‌లో కేక్ కట్ చేసి ఆనందం పంచుకున్నారు. ఆ ఆనందమే ఆఖరు అని, ఒక్క రాత్రిలో తమ జీవితంలో పెను విషాదం చోటుచేసుకుంటుందని ఊహించనే లేదు. కుమార్తెకు సీటు వచ్చినందుకు దైవ దర్శనానికి కారులో వెళ్తుండగా, నిద్రమత్తులో కనురెప్ప పడిన క్షణకాలంలోనే ఘోరం జరిగిపోయింది. కంచిలిలో కరెంటు స్తంభాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది.

వార్త... మెయిన్‌లో

వీడని ముసురు

- అల్పపీడన ప్రభావంతో చిరుజల్లులు
- జిల్లాలో 7.4 మి.మీ వర్షపాతం నమోదు
- పెరిగిన చలి తీవ్రత

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం జిల్లాను వారం రోజులుగా వదలడం లేదు. ఆదివారం ఒక్కరోజు తెరిపినిచ్చినా సోమవారం నుంచి మళ్లీ మబ్బుల వాతావరణంతో జిల్లాలోని పలుచోట్ల మోస్తరు వర్షాలు కురిశాయి. మంగళవారం పది మండలాలు మినహా మిగతా మండలాల్లో చిరుజల్లులు కురిశాయి. జిల్లావ్యాప్తంగా 7.4 మిల్లీ మీటర్ల సరాసరి వర్షపాతం నమోదైంది. హిరమండలంలో 1.38 మి.మీ వర్షం కురవగా కొత్తూరులో 1.24, రణస్థలంలో 1 మి.మీ వర్షపాతం నమోదైంది. కవిటి, సోంపేట, ఇచ్ఛాపురం, మందస, వజ్రపుకొత్తూరు మినహా మిగిలిన తీర ప్రాంత మండలాల్లో వర్షం కురిసింది.

వర్ష ప్రభావం ఉండడంతో రైతులు పొలాల నుంచి ఇళ్లకు తరలించిన ధాన్యాన్ని టార్పాలిన్లతో కప్పి ఉంచారు. వర్షాలను దృష్టిలో పెట్టుకుని కోతలను వాయిదా వేసుకుంటున్నారు. మరోవైపు చలిగాలుల తీవ్రత కొనసాగుతోంది. పగటి ఉష్ణోగ్రతలు తగ్గడంతో పాటు శీతల గాలులు వీస్తుండడంతో చలి తీవ్రత పెరిగింది. జిల్లాలో మంగళవారం పగటి పూట 22 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైంది. చలి తీవ్రత పెరగడంతో వృద్ధులు, ఆస్తమా రోగులు, పిల్లలు అవస్థలు పడుతున్నారు.



పారిశ్రామిక అవకాశాలపై బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి తదితరులు

జిల్లాలో ఉద్యోగ విప్లవం సృష్టించాలి

- పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి
- 'ఇన్వెస్ట్ ఇన్ శ్రీకాకుళం' పేరిట త్వరలో పారిశ్రామికవేత్తలతో సదస్సు
- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

దేశంలో ఎక్కడికి వెళ్లినా ఉత్తరాంధ్రకు చెందిన కార్మికులు, ఉద్యోగులే కనిపిస్తారని.. స్థానికంగా ఉన్న మానవ వనరులను పరిశ్రమలు సద్వినియోగం చేసుకోకపోవడమే దీనికి కారణమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తూ.. జిల్లాలో వేలాది మందికి ఉపాధి కల్పించేలా పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలు ఉద్యోగ విప్లవానికి నాంది పలకాలని పిలుపునిచ్చారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన సంస్థ ఆధ్వర్యాన నగరంలోని ఒక హోటల్‌లో పలు పారిశ్రామిక సంస్థల యాజమాన్య ప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన హెచ్‌ఆర్ కాన్‌క్లేవ్‌లో ఆయన మాట్లాడారు. తన కార్యాలయంలో నిర్వహించే ప్రజా దర్బార్‌కు వచ్చే వినతుల్లో 70 శాతం ఉద్యోగాలకు సంబంధించినవేనని చెప్పారు. జిల్లాలో కొత్త పరిశ్రమలు, ఉపాధి కేంద్రాల ఏర్పాటు ద్వారానే దీనికి పరిష్కార మార్గం చూపవచ్చని సూచించారు. పారిశ్రామికవేత్తలు, పరిశ్రమల ప్రతినిధులు సహకారం అందించాలని కోరారు. జిల్లా పరిధిలో పరిశ్రమలు ఏర్పాటు చేసిన వారు.. అనుబంధ పరిశ్రమలను సైతం స్థానికంగా నెలకొల్పడం ద్వారా కొత్తగా ఉద్యోగావకాశాలు సృష్టించడంతో పాటు రవాణా, ఇతర ఖర్చులను తగ్గించుకోవచ్చని వివరించారు. జిల్లాకు చెందిన కార్మికులకు మరిన్ని అవకాశాలు కల్పించేలా పరిశ్రమలు ముందుకు రావాలన్నారు. కొత్తగా పరిశ్రమలు, పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తోందని తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఇన్వెస్ట్ ఇన్ శ్రీకాకుళం పేరిట జిల్లాలో తొలిసారిగా పారిశ్రామికవేత్తలతో సదస్సు నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

ఐటి రంగాన్ని విస్తరించాలి

విశాఖపట్నంలో పెట్టుబడులు పెట్టే ఐటీ పరిశ్రమలు దీనిని మరింత విస్తరించాలని, జిల్లాలో పెట్టుబడులు పెట్టే విధంగా అవకాశాలను పరిశీలించాలన్నారు. జిల్లాలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ సహ ఎన్నో విద్యాసంస్థలు, ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయని తెలిపారు. చదువులు పూర్తయిన వెంటనే విద్యార్థులకు ఉద్యోగాలు లభించేలా ప్రత్యేక నైపుణ్య శిక్షణ అందించాలని సూచించారు. అంతకుముందు జిల్లాలో ఉపాధి అవకాశాలు, పరిశ్రమల కల్పనపై కలిగిన అవకాశాలపై కూడిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. సదస్సులో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్యే గొండు శంకర్, ఎపిఎస్ఎస్‌డిసి జిల్లా మేనేజర్ యు.సాయికుమార్, ఫార్మా, గ్రానైట్, ఎలక్ట్రానిక్స్, బ్యాంకింగ్, టూరిజం, హెల్త్ కేర్, హాస్పిటాలిటీ, రిటైల్ తదితర రంగాలకు చెందిన హెచ్‌ఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

రైతులకు అన్యాయం చేస్తే ఆందోళన

ఎమ్మెల్సీ నర్తు రామారావు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

వర్షాలకు అతలాకుతలమైన జిల్లా రైతాంగానికి భరోసా కల్పిస్తూ స్పష్టమైన ప్రకటన ప్రభుత్వం చేయాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. తక్షణమే జిల్లా రైతాంగానికి అదుకునే విధంగా అధికార యంత్రాంగానికి వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఇప్పటికే వందలాది ఎకరాల పంట నీటిలోనే ఉన్నట్లు తన పర్యటనలో గుర్తించినట్లు తెలిపారు. నాలుగు రోజులుగా రైతులు నానావస్తలు పడుతున్నా ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రకటన రాకపోవడం దారుణమన్నారు. రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి నష్టపోయిన రైతులకు సంబంధించి జాబితాలు వెంటనే తయారు చేయాలన్నారు. ఎకరానికి రూ.40 వేలు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. సమావేశంలో ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

అపరిష్కృతంగా ఉన్న ప్రాపర్టీ, మహిళలకు సంబంధించిన పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో డిఎస్‌పిలు, సిఐలు, ఎస్‌ఐలతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాపర్టీ కేసుల్లో త్వరితగతిన ఛార్జిషీట్ దాఖలు చేసి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో స్వీకరించిన ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇస్తూ విచారణ చేసి, బాధితులకు చట్ట పరిధిలో న్యాయం చేకూర్చాలన్నారు. ఫిర్యాదులపై ఎటువంటి నిర్లక్ష్యం వహించకుండా పరిష్కారం చూపాలని ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో డ్రైవింగ్ లైసెన్సులు సీజ్ చేయాలని ఆదేశించారు. పేకాట శిబిరాలు, బెల్టు షాపులపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. డిఎస్‌పిలు, సిఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది తప్పనిసరిగా గ్రామ సందర్శనలు చేయాలని, ప్రజలతో మమేకమై గ్రామంలో సమస్యలను గుర్తించాలని సూచించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశమున్న వారిని ముందస్తుగా బైండోవర్ చేయాలన్నారు. గంజాయి నియంత్రణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, గంజాయి కేసుల్లో అరెస్టయిన నిందితులపై నిరంతర నిఘా పెట్టాలన్నారు. నిరంతరం వాహన తనిఖీలు చేస్తూ, జిల్లాలో పూర్తిస్థాయిలో అక్రమ రవాణాను అరికట్టాలని ఆదేశించారు. సంకల్పం పేరిట ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ నేరాలు, రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాత ముద్దాయిలపై ప్రత్యేకంగా నిఘా ఉంచి వారి కదలికలపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎఎస్‌పి కె.వి రమణ, డిఎస్‌పిలు వివేకానంద, మూర్తి, ఎఒ గోపీనాథ్, సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

దోపిడీ కేసులో నలుగురు అరెస్టు

రూ.10వేల నగదు, మారణాయుధాలు స్వాధీనం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరంలో సంచలనం రేకెత్తించిన దోపిడీ కేసును ఒకటో పట్టణ పోలీసులు ఛేదించారు. వ్యాపారవేత్త కోరాడ గోవింద్ ఇంట్లోకి చొరబడి బీభత్సం సృష్టించి పరారైన కేసులో పోలీసులు నలుగురుని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.పది వేల నగదు, మూడు కత్తులు, ఒక కటింగ్ ప్లేయర్, ఒక మోటార్ సైకిల్, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని డిఎస్‌పి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలను డిఎస్‌పి సిహెచ్.వివేకానంద వెల్లడించారు. శ్రీకాకుళం నగరంలోని ఎల్‌బిఎస్ కాలనీ, గూనపాలెం చెరువుగట్టు ప్రాంతంలో ఉండే కిరాణ వ్యాపారి పెద్దిన లక్ష్మణరావు అడ్డదారిలో డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశంతో దోపిడీకి పథక రచన చేశాడు. తెలంగాణ రాష్ట్రం నుంచి హోల్‌సేల్ షాపులకు ఆయిల్ ప్యాకెట్ల లోడుతో తీసుకొచ్చే లారీ డ్రైవర్ అయిన సజ్జు అలియాస్ కార్తీక్‌తో ఆయనకు పరిచయమైంది. తనకి కొంతమంది కుర్రాళ్ల అవసరం ఉందని ఎవరైనా ఉంటే పని ఇస్తానని చెప్పాడు. సజ్జుకి పరిచయం ఉన్న భద్రాచలంకి చెందిన యాకూబ్‌తో పెద్దిన లక్ష్మణరావును మాట్లాడించగా అతడి మేనల్లుడైన సయ్యద్ అర్షద్‌ని పరిచయం చేశాడు. వారం రోజుల కిందట లక్ష్మణరావు శ్రీకాకుళంలో పని ఉందని సయ్యద్ అర్షద్‌తో మాట్లాడి, తనతో పాటు ఇద్దరు కుర్రాళ్లను తీసుకురావాలని చెప్పాడు. అర్షద్‌తో పాటు తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెంకు చెందిన చిగురుపాటి ఆంజనేయులు, నాగర్ కర్నూల్‌కు చెందిన కూరాకుల భానుప్రసాద్ శ్రీకాకుళం వచ్చి లక్ష్మణరావును కలిశారు. ఉమెన్స్ కాలేజీ దగ్గర్లో ఉన్న ఇండియన్ బ్యాంకు దొంగతనం చేయాలని చెప్పగా, అక్కడ జనాభా ఎక్కువగా ఉండడంతో వారు భయపడ్డారు. తర్వాత లక్ష్మణరావు ఇంటికి సమీపంలో ఉన్న వేరొకరి ఇంటిని చూపించగా వారు అక్కడకు వెళ్ళేసరికి కేకలు వేయడంతో భయపడి పారిపోయారు. తర్వాత వ్యాపారవేత్త కోరాడ గోవింద్ ఇంటిని చూపించి వారి ఇంటికి వెళ్ళి బెదిరిస్తే అధిక మొత్తంలో డబ్బులు, బంగారం సొంతం చేసుకోవచ్చని చెప్పి పంపించాడు. కోరాడ గోవిందరావు ఇంట్లోకి ముగ్గురూ ప్రవేశించి కత్తులను చూపించి ఇంట్లో ఉన్న మహిళలను బెదిరించి టేబుల్‌పై ఉన్న రూ.12 వేల నగదును తీసుకున్నారు. ఇంట్లో ఉన్న యువకుడిపై దాడి చేయగా, అతడు ధైర్యంగా ఎదిరించి కేకలు వేయడంతో వీరు పరారయ్యారు. డిఎస్‌పి వివేకానంద పర్యవేక్షణలో సిఐ పైడపునాయుడు ఆధ్వర్యాన ఎస్ఐ రమేష్‌బాబు, హెడ్ కానిస్టేబుల్ బి.రవికుమార్ ఇతర సిబ్బంది ఈనెల 23న డచ్ బంగ్లా వద్ద వీరిని అరెస్టు చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు డిఎస్‌పి తెలిపారు. ఈ కేసు ఛేదించడంలో ప్రతిభ కనబరచిన పోలీసు సిబ్బందిని అభినందించారు. సమావేశంలో సిఐ పైడపునాయుడు పాల్గొన్నారు.

వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి వివేకానంద

వినియోగదారుల చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వినియోగదారుల చట్టాలపై అవగాహన అవసరమని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో మంగళవారం నిర్వహించిన జాతీయ వినియోగదారుల దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఆన్‌లైన్ శకం నడుస్తోందన్నారు. వినియోగదారులు నష్టపోకుండా ఉండేందుకు, మోసపూరిత వ్యాపారస్తులకు అడ్డుకట్ట వేయాలనే లక్ష్యంతో వినియోగదారుల చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ఈ చట్టం గురించి సరైన అవగాహన లేనందున కొందరు వినియోగదారులు ఇప్పటికీ నష్టపోతున్నారని చెప్పారు. వినియోగదారులు తాము కొనుగోలు చేసిన వస్తువుపై పూర్తి అవగాహన కలిగినప్పుడు, కొనుగోలు చేసిన వస్తువు నిర్దేశించిన ప్రమాణాల్లో ఏమైనా లోపం ఉంటే వారికి ప్రశ్నించే హక్కు ఈ చట్టం ద్వారా ఏర్పడిందన్నారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆన్‌లైన్ వ్యాపారంలో కొన్న వస్తువులపై కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. వారం రోజుల పాటు పలు కళాశాలల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. డ్రగ్ కంట్రోల్, తూనికలు కొలతలు, భారత్ గ్యాస్, హెచ్.పి గ్యాస్, ఉద్యానశాఖ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. జిల్లా వినియోగదారుల సంఘం చైర్మన్ బగాది రామ్మోహనరావు అధ్యక్షతన వహించిన కార్యక్రమంలో డిఎస్ఒ జి.సూర్యప్రకాశరావు, డిఎంహెచ్ఒ బి.మీనాక్షి, డిసిహెచ్ఎస్ ఎన్.కళ్యాణ్‌బాబు, జిఎస్‌టి సహాయక కమిషనర్ రాణీమోహన్, ఆత్రా అధ్యక్షులు గంజి ఎజ్రా తదితరులు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న జాయింట్ కలెక్టరు ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్యే రవికుమార్

నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఎస్ఎఫ్ఐ ఫ్లాష్‌మాబ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 43వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ విద్యార్థులు ఫ్లాష్‌మాబ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని పలు కూడళ్లతో పాటు ఆర్ట్స్ కళాశాల మైదానంలో మంగళవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా సామాజిక చైతన్య కార్యక్రమాలను ప్రదర్శించారు. మాదకద్రవ్యాలు, మహిళలపై దాడులు, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పలు పాటలకు నృత్యాలను చేశారు. ప్రజలను జాగృతం చేస్తూ చేపట్టిన ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకోవడమే కాకుండా ఆలోచింపజేసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.హరీష్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలతో పాటు విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ, సమాజ చైతన్య కార్యక్రమాలనూ నిర్వహిస్తోందన్నారు. మాదకద్రవ్యాల వల్ల యువత జీవితాలు మృగ్యమవుతున్నాయని తెలిపారు. ఈనెల 28, 29 తేదీల్లో టెక్కలిలో నిర్వహించే ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చందు, చిన్నారావు, దివ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్దానం గుండె కోస్తే ఊరుకోం

- ఉప్పు భూముల్లో ఎయిర్‌పోర్టు పెట్టాలి
- మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి - పలాస

ఎయిర్‌పోర్టు వంటి అభివృద్ధి ప్రాజెక్టులను ఆహ్వానిస్తామని, అదే సమయంలో ఆ పేరుతో పచ్చని ఉద్దాన ప్రాంతం గుండె కోస్తామంటే మాత్రం ఊరుకునేది లేదని మాజీ మంత్రి, వైసిపి నాయకులు సీదిరి అప్పలరాజు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్థానిక ప్రగతి భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ప్రజలు వ్యతిరేకించడం వల్ల భావనపాడు పోర్టు పనులు ముందుకు సాగక దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉండిపోయిందన్నారు. గత వైసిపి ప్రభుత్వం పోర్టు డిజైన్‌ను మార్చి, నిర్వాసితుల సంఖ్యను తగ్గించి ప్రజల అనుమతితో మూలపేట పోర్టు పనులు ప్రారంభించిందని తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం ప్రజలకు సమాచారం లేకుండా వారి భూముల్లోకి అధికారులను పంపిస్తుండడంతో వారిలో ఆందోళన నెలకొందన్నారు. ప్రభుత్వం ప్రజల మనోభావాలను గౌరవించాలని, వారి అభిప్రాయాన్ని స్వీకరించాలని కోరారు. ప్రజలకు ఇబ్బందుల్లేకుండా మూలపేట పోర్టు పనులు ఏవిధంగా సేకరించామో, అదే తరహాలో ప్రజలు నష్టపోకుండా 1300 ఎకరాల్లో ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపట్టవచ్చని చెప్పారు. వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి పంచాయతీ పరిధిలో 1800 ఎకరాల భూములు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఉప్పు భూములు ఉన్నాయని తెలిపారు. ఆ భూములను ఎయిర్‌పోర్టుకు అనుకూలంగా అభివృద్ధి చేసి నిర్మాణం చేసుకోవచ్చని సూచించారు. మూలపేట పోర్టు సమీపంలో పోర్టుకు అనుబంధంగా తొమ్మిది వేల ఎకరాల సాల్ట్ ల్యాండ్ బ్యాంక్‌ను వైసిపి ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. ప్రభుత్వ భూములు ఎక్కువున్న చోట ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపట్టాలన్నారు. సమావేశంలో మందస ఎంపిపి డొక్కర దానయ్య, పలాస ఎంపిపి ప్రతినిధి సాయికృష్ణ, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి శిష్టు గోపి, మాజీ ఎంపీపీ బత్తిన హేమేశ్వరరావు, దువ్వాడ మధు, బమ్మిడి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి అప్పలరాజు

చిన్నారికి కేక్ తినిపిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కుష్టు వ్యాధిగ్రస్తులకు సహకారం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో కుష్టు వ్యాధి బారిన పడి అనారోగ్యంతో ఉన్న వారితో పాటు వారి కుటుంబ సభ్యులకు తనవంతు పూర్తి సహకారాన్ని అందిస్తానని కలెక్టరు స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. నగరంలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీ సమీపాన గల లెప్పర్సీ కాలనీ కరుణ సమాజంలో రెడ్‌క్రాస్, ఆప్‌హోల్డ్ ఆధ్వర్యాన క్రిస్మస్ వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆయన పాల్గొని చిన్నారుల చేత కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, అప్‌హోల్డ్ ప్రతినిధి తిమోతి కరుణ సమాజ సభ్యులు పాల్గొన్నారు.

28 నుంచి జాతీయస్థాయి ఆవిష్కార్

టెక్కలి రూరల్ : సమాజంలో ఉన్న పలు సమస్యలను గుర్తించి వాటికి సాంకేతిక పరిష్కారాలను కనుగొనుందుకు దేశవ్యాప్తంగా ఆసక్తిగల ఇంజినీరింగ్ విద్యార్థులు ఒకచోట చేరి 48 గంటల పాటు నిర్విరామంగా కృషి చేసేందుకు రెండో సారి ఐతమ్ కళాశాల వేదిక కానుందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించారు. టెక్కలి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 28, 29, 30 తేదీల్లో జాతీయ స్థాయి ఆవిష్కార్ (48 గంటల) హేకాన్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇదే పోటీలను గడచిన ఫిబ్రవరిలో నిర్వహించగా సీజన్-2 కింద రెండో విడతగా ఈ నెలాఖరులో నిర్వహిస్తున్నామని అన్నారు. ఐఐటి, ఎన్ఐటి, డీమ్డ్ యూనివర్సిలు, ఇతర ఇంజినీరింగ్, కళాశాలల నుంచి దేశ వ్యాప్తంగా 18 రాష్ట్రాలకు చెందిన 1500 బృందాలు తమ పేర్లను నమోదు చేసుకోగా, వాటిని ఆన్‌లైన్ ద్వారా 5 రౌండ్లలో పరిశీలించి చివరగా 70 బృందాలను ఎంపిక చేశామని అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, కన్వీనర్ డాక్టర్ జి.సతీష్ కుమార్, స్పాన్సర్ షిప్ లీడ్గా డాక్టర్ ఎం.వి.ఎన్.ఎస్.సంతోష్‌కుమార్, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్ జె.సురుష్‌కుమార్, గిరీష్‌కుమార్, స్టూడెంట్ కన్వీనర్ సాయిశ్రీనివాస్, కో-కన్వీనర్ ఎస్.శ్రావ్యలు వ్యవహరిస్తున్నట్టు వెల్లడించారు.

నిబంధనలకు విరుద్ధం

మెళియాపుట్టి : కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ నిబంధనలకు విరుద్ధంగా సర్వీసులో ఒక్కసారీ పాఠాలు చెప్పని నాన్ టీచింగ్ సిబ్బందికి జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగోన్నతులు ఎలా కల్పిస్తారని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు బి.ఢిల్లేశ్వరావు, మండల అధ్యక్షులు టి.కామేశ్వరరావు ప్రధాన కార్యదర్శి జె.ధర్మారావు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. దీనికి సంబంధించిన సోమవారం విడుదల చేసిన జిఒను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. జిఒ 302 ప్రకారం జూనియర్ లెక్చరర్ పోస్టుల్లో 40 శాతం ఉద్యోగోన్నతులను బోధన అనుభవం ఉన్న, అర్హత కలిగిన ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని కోరారు.

రైతులను ఆదుకుంటాం

ప్రజాశక్తి- కవిటి

అల్పపీడనం ప్రభావంతో ఖరీఫ్ రైతులు తీవ్ర నష్టానికి గురయ్యారని, వారికి ప్రభుత్వం అన్నివిధాలా న్యాయం చేస్తుందని సోంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు జగన్మోహనరావు అన్నారు. మండలంలోని పుటియాదల, పుక్కళ్లపాలెం తదితర ప్రాంతాల్లో పంట పొలాలను కృషి విజ్ఞాన కేంద్రం ఆమదాలవలస శాస్త్రవేత్త డాక్టర్ అనూషతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ వారికి భరోసా కల్పించారు. మిగిలిన పంట ఏవిధంగా సంరక్షించుకోవాలో సూచించారు. కార్యక్రమంలో సోంపేట, కవిటి ఎఒలు బి.నరసింహమూర్తి, బి.దుర్గాప్రసాద్, వ్యవసాయ సహాయకురాలు బి.సమన్వయ, జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు బెందాళం రమేష్, కొబ్బరి ఉత్పత్తిదారుల సంస్థ అధ్యక్షుడు ఆరింగి అనిల్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : రెండు రోజులుగా కురిసిన వర్షాలకు బెల్లుపడ, ఈడుపురం గ్రామాల్లో అకాల వర్షాలతో తడిచిన ధాన్యం, తడిచిన పన్నలు, నేలకొరిగిన వరి పంట పొలాలను వ్యవసాయ సంచాలకులు జగన్మోహన్, డాక్టర్ అనుష, మండల ఎఒ టి.భార్గవి, వ్యవసాయ సహాయకులు మల్లేశ్వరరావు పరిశీలించారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు కె.ధనుంజయ్ పాల్గొన్నారు.

కవిటి : తడిచిన వరి చేనును పరిశీలిస్తున్న అధికారులు

మెళియాపుట్టి : వేరుశనగ విత్తే ముందు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని పలాస వ్యవసాయశాఖ ఎడి లింగాల మధుబాబు అన్నారు. మండలంలోని రంగడుగాటి, పూలసార గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. తుపాను వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ప్రభుత్వం అందజేస్తుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎఒ దానకర్ణుడు, గ్రామ వ్యవసాయ సహాయకులు జయలక్ష్మి, ఈశ్వరి, జగన్నాథ డౌడ్, నవీన్‌చంద్ర పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రైతులు సాగుచేస్తున్న పెసర, మినప, వేరుశనగ పంటలలో వర్షాపునీరు నిల్వ లేకుండా తొలగించాలని స్థానిక వ్యవసాయ శాఖ అధికారి ఎస్.గోవిందరావు అన్నారు. మండలంలోని లఖందిడ్డి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు కర్రి అప్పారావు, విఎఎ ఎం.సాయికిరణ్ పాల్గొన్నారు.

సోంపేట : ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన వారి పంట పొలాలను శ్రీకాకుళం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త అనూష, మండల వ్యవసాధికారులు మామిడిపల్లి, బారువ, పలాసపురం, జింకీభద్ర పరిసర గ్రామాల్లో నీట మునిగిన పంటను పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట నష్టాన్ని అంచనా వేశారు. తడిసిన ధాన్యాన్ని ఎలా జాగ్రత్త చేసుకోవాలో రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఎడిఎ కె.జగన్మోహనరావు, ఎం నరసింహమూర్తి పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి

నందిగాం : ఆధునిక పద్ధతుల ద్వారా రైతులు అధిక దిగుబడులు పొందే వీలు ఉందని మండల ఎం పి.శ్రీకాంత్‌వర్మ అన్నారు. మండలంలోని భరణిగా, దేవాడ గ్రామాల్లో మంగళవారం పొలంపడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రబీలో వేరుసెనగ, పెసర, మినుము వంటి పంటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టే అధిక లాభాలు పొందవచ్చునని సూచించారు. వేరుశనగ పంటలో కుళ్లు తెగులు నివారణకు బైటాక్స్ మందును లీటర్ నీటికి మూడు గ్రాములు కలిపి పైరుపై పిచ్చికారీ చేయాలన్నారు. పంటలకు ఐదు నుంచి పది కేజీల యూరియా, నాలుగు కేజీల పొటాషియం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అసిస్టెంట్ రాణి, రైతులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : అవగాహన కల్పిస్తున్న మధుబాబు

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

ఎమ్మెల్సీ నర్తు రామారావు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రైతాంగానికి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బోర పుష్ప అధ్యక్షతన మంగళవానం నిర్వహించిన మండల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు చేతికొచ్చే పంట నీట మునిగిందని అన్నారు. దీనిపై ఎఒ భార్గవి మాట్లాడుతూ మండలంలోని దెబ్బతిన్న పంట పొలాలను పరిస్థితి పరిస్థితిని పరిశీలించి సర్వే నివేదికను కలెక్టర్‌కు పంపించానని తెలిపారు. రాజ్యాంగానికి విరుద్ధంగా గహ నిర్మాణాల విషయంలో అధికారులు ప్రవర్తిస్తున్న తీరును ఈదుపురం సర్పంచ్ నర్తు వరప్రసాద్ మండిపడ్డారు. నష్టపోయిన రైతులకు అపరాలు విత్తనాలు అందించాలని సభ్యులు దక్కత ఏకాంబరి కోరారు. తేలుకుంచి సర్పంచ్ పి.రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ పంచాయతీని రైతులకు టార్పాలిన్లను సరఫరా చేయాలని విన్నవించారు. రేషన్ సరుకుల పంపిణీలో కార్డుదారులకు

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

తీరని అన్యాయం జరుగుతుందని కేసుపురం సర్పంచ్ ఢిల్లీరావు రెవెన్యూ అధికారుల తీరుపై మండిపడ్డారు. రేషన్ బియ్యం బస్తాల్లో మూడు, నాలుగు కేజీలు తక్కువ వస్తున్నాయని సభ దృష్టికి తీసుకెళ్లారు. డిటి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ అందరకీ రేషన్ అందిస్తున్నామని, తెలుకుంచిలో రేషన్ పంపిణీని పరిశీలిస్తానని తెలిపరాఉ. ఉద్దానం తాగునీటి పథకం లీకుల వల్ల తమ గ్రామం జలమయం అవుతుందని సర్పంచ్ గుజ్జు ఢిల్లీరావు ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపిడిఒ రామారావు, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, ఇరిగేషన్ ఎఇ పాణిగ్రహి, ఎంఇఒ అప్పారావు, ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి నాగరాణి, ఉద్యానవనశాఖ ఎఇ మాధవీలత పాల్గొన్నారు.

రూ.30 వేలు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి- కొత్తూరు

వర్షాలు కారణంగా నష్టపోయిన గిరిజన రైతులను రూ.30 వేలు నష్టపరిహారం అందించాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలోని గొట్టిపల్లి పంచాయతీలో గిరిజన రైతులతో కలిసి పాడైన పంటను మంగళవారం పరిశీలించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనులు పండిస్తున్న వరి పంట వర్షాలు పూర్తిగా నేలకొరిగిందన్నారు. గిరిజన రైతులు వేలల్లో పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రంగు మారినవి, మొలకెత్తిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు.

నిరసన తెలుపుతున్న గిరిజనులు

నిందితులను బైండోవర్ చేయిస్తున్న సిఐ బేబి

బెల్లంఊటలు ధ్వంసం

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని సవర మధ్య గ్రామ సమీపంలో 700 లీటర్ల బెల్లం ఊటలను మంగళవారం ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కె.బేబి తెలిపారు. ఈ దాడుల్లో సోంపేట, కోటబొమ్మాళి ఎక్సైజ్ సిబ్బంది, శ్రీకాకుళం ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారని అన్నారు. అలాగే కంచిలి మండలం గోపకేలికు చెందిన టి.భీమారావు ద్విచక్ర వాహనంపై 30 లీటర్ల నాటుసారా తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. అయితే నిందితుడు వాహనాన్ని వదిలి పరారయ్యారని అన్నారు. పాత కేసుల్లో 11 మంది నిందితులను సోంపేట మండల మెజిస్ట్రేట్ ముందు బైండోవర్ చేసినట్లు తెలిపారు.

నాటుసారాతో మహిళ అరెస్టు

పాతపట్నం : మండలంలోని పూతికగూడలో 2.5 లీటర్ల నాటుసారాతో అదే గ్రామానికి చెందిన మహిళను అరెస్టు చేశామని ఎక్సైజ్ సిఐ కోట కృష్ణరావు మంగళవారం తెలిపారు. ఆమెను నరసన్నపేట కోర్టులో హాజపర్చినట్లు తెలిపారు. నాటుసారా తయారీ చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

వివరాలు సేకరిస్తున్న డిటి మురళీకృష్ణ

డీలర్‌పై కేసు నమోదు

వజ్రపుకొత్తూరు : వజ్రపుకొత్తూరు చౌక డిపో డీలర్ కదంబాల ఉమామహేశ్వరిపై కేసు నమోదు చేసినట్లు మండల పౌర సరఫరాల ఉప తహశీల్దార్ మురళీకృష్ణ తెలిపారు. వజ్రపుకొత్తూరులోని చౌక డిపో కేంద్రాన్ని మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద ప్రజలకు ప్రభుత్వం సరఫరా చేసే వినియోగ వస్తువుల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయని గుర్తించామని తెలిపారు. రికార్డులు పరంగా ఉండాల్సిదానికంటే బియ్యం 845 కిలోలు, పంచదార 34 పాకెట్స్ తక్కువ ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. వివరాలు ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

లావేరు : మాట్లాడుతున్న తహశీల్దార్ రాజారావు

బూర్జ: రైతుల సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారని మార్క్ ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ అన్నారు. మండలంలోని పెద్దపేట పంచాయతీలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు న్యాయం చేసేందుకు వంద భూమి కలిగిన వారికి పూర్తి హక్కులను కల్పించేందుకు భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని అన్నారు. రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సదస్సులో తహశీల్దార్ పద్మావతి కడగల కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

లావేరు : రైతులు రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ఎన్ని జోగారావు అన్నారు. మండలంలోని వెంకటాపురంలో రెవెన్యూ సదస్సు నిర్వహించి 33 వినతిపత్రాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంఎస్‌బి శ్రీధర్‌రెడ్డి, భూ రీ సర్వే డిటి ఎం.తిరుపతిరావు, సర్పంచ్ ప్రతినిధి బొంతు ఎల్లంనాయుడు, టిడిపి నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కు కల్పించాలని వినతి

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని భైరిపురంలో వంద మంది రైతులకు భూ హక్కు కల్పించాలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను రైతులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ దృష్టికి విప్ ఈ విషయాన్ని తీసుకెళ్లారు. 1975లో భైరిపురంలో సర్వే నంబరు 143, 169, 170, 171లో బంజరు భూముల్లో సుమారు వంద మంది పేదలకు 42.5 సెంట్ల భూమి డి పట్టాలు ఇచ్చినట్టు తెలిపారు. అప్పటి నుంచి రైతులు ఆ భూమికి సంబంధించి ఫలసాయం పొందుతున్నా సంబంధిత భూమికి సంబంధించి భూహక్కు పత్రాలు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి వచ్చే ఎటువంటి లబ్ధిపొందడం లేదని తెలిపారు. రైతుల శ్రేయస్సు దృష్ట్యా ఇప్పటికైనా వారికి హక్కు పత్రాలు మంజూరు చేసేలా చూడాలని కోరారు.

కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న విప్ అశోక్

విద్యార్థులతో రాజేష్

గణితంపై భయం వీడాలి

ప్రజాశక్తి- కవిటి

విద్యార్థులు గణితంపై ఉన్న భయాన్ని పక్కనపెట్టి సాధన చేస్తే అద్భుతాలు సాధిస్తారని కళ్యాణి ఆంగ్ల పాఠశాల కరస్పాండెంట్ లోళ్ల రాజేష్ అన్నారు. కళ్యాణి ఆంగ్ల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నిర్వహించిన గణిత ప్రతిభ పరీక్షలో విజేతలకు మంగళవారం బహుమతులు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన జీవితంలో ప్రతి అడుగూ గణితంతోనే ముడిపడి ఉంటుందని అన్నారు. చిన్నప్పటి నుంచే గణితంపై మక్కువ పెంచుకుంటే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బిందు మాధవి, ఎఒ ఎం.రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెత్త బుట్టల పంపిణీ

మెళియాపుట్టి : మండలంలోని జాడుపల్లి సచివాలయంలో మంగళవారం చెత్త బుట్టలను ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఉంచి వాహనదారులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జై.గాయత్రి, ఎంపిటిసి ప్రతినిధి కదంబల పైడిరాజు, ఎన్ని మనోహర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పలువురు ఆర్థికసాయం

లావేరు : లావేరు జెడ్‌పి పాఠశాలలో 2005లో పదో తరగతి చదివిన లంకలపల్లి సునీత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు రూ.40 వేలు ఆర్థికసాయం మృతుడికి తండ్రికి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఇనుమూర్తి కిషోర్‌కుమార్, సత్యనారాయణ, కోల రాజేష్, గండి సురేష్, శివ రమేష్, మంగ విజయలక్ష్మి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : కేన్సర్‌తో బాధపడుతున్న కోటబొమ్మాళి మండలం లకందిడ్డికి విద్యార్థి టి.విద్యావతి వైద్య ఖర్చులకు రూ10 వేలు, సుగర్ కారణంగా కుడికాలును కోల్పోయిన

సంతబొమ్మాళి : ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

సంతబొమ్మాళి మండలం వల్లెవలసకు చెందిన అల్లంకోటి కుటుంబానికి రూ.10వేలును విఫర్‌నీడ్, అమెరికా సంస్థ అందించింది. ఈ సహాయాన్ని మనబడి వెల్ఫేర్ అసోసియేషన్ వల్లేవలస సభ్యులు అందించారు. కార్యక్రమంలో మనబడి అసోసియేషన్ ప్రతినిధులు రెడ్డి సూరిబాబు మాస్టర్, గేదెల శివారెడ్డి, ఇప్పిలి అప్పన్న, పాకాల జగదీష్‌లు పాల్గొన్నారు.

'పోరుబాట' పోస్టర్ ఆవిష్కరణ

నరసన్నపేట : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కృష్ణదాస్

ప్రజాశక్తి- నరసన్నపేట

చంద్రబాబు పాలనలో విద్యుత్ ఛార్జీల పెంపు భారాన్ని మోపడాన్ని నిరసిస్తూ ఈ నెల 27న జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో వైసిపి పోరుబాట పేరిట ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. ప్రజలపై ఏకంగా రూ.15,485 కోట్ల భారాన్ని మోపుతూ, ఛార్జీల పెంపునకు నిరసనగా స్థానిక వైసిపి కార్యాలయంలో పోరుబాట పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్నికలకు ముందు ప్రజలకు చంద్రబాబు అనేక హామీలిచ్చారని, అందులో భాగంగా తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీల పెంపుదల ఉండదని ప్రజలను నమ్మించారని గుర్తుచేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ప్రజలపై రూ.వేల కోట్ల భారాన్ని మోపుతున్నారని అన్నారు. కార్యకర్తలు, అభిమానులు పాల్గొని నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సోంపేట : స్థానిక రాధాకృష్ణ ఆలయం వద్ద పోరుబాట పోస్టర్‌ను జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఇప్పిలి లోలాక్షి, నాయకులు దేవదాస్‌రెడ్డి, ఇప్పిలి కృష్ణారావు, గుమ్మడి రామదాసు, కొనపల్ల సురేష్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: ఈ నెల 27న వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ ఆధ్వర్యాన టెక్కలి విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట నిరసన చేపడుతున్నామని, దీనిని విజయవంతం చేయాలని కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు ఒక ప్రకటనలో కోరారు.

రణస్థలం : ఈ నెల 27న నిర్వహించనున్న పోరుబాటుపై విద్యుత్‌శాఖ అధికారులకు మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : బొడ్డేపల్లిలో జగనన్న ప్రజాసేవ కార్యాలయంలో పోరుబాట పోస్టర్‌ను వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సరుబుజ్జిలి జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, గురుగుబెల్లి శ్రీనివాసరావు, సువ్వారి నేతాజీ పాల్గొన్నారు.

రణస్థలం : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

టెక్కలి రూరల్ : స్థానిక వైసిపి కార్యాలయంలో పోరుబాట పోస్టర్‌ను నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, పాల వసంతరెడ్డి ,మండల పార్టీ అధ్యక్షులు నూక పుష్కరరావు, పి.రామారావు, సత్తారు సత్యం, హనుమంతు వెంకటేశ్వరరావు, రాహుల్‌కుమార్, సంపతరావు హేమ సుందరరావు, తమ్మన్న గారి కిరణ్ పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో 'స్వర్ణభారతి' విజయభేరి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

హర్షిత

లిఖిత

డిగ్రీ ఐదో సెమిస్టర్ ఫలితాల్లో స్వర్ణభారతి విద్యార్థులు విజయ భేరి మ్రోగించారు. గత నెల నవంబరులో నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో వలపల హర్షిత ఎంపిసిఎస్ విభాగంలో 9.6 పాయింట్లు సాధించి మండలంలో ప్రథమస్థానాన్ని కైవసం చేసుకుంది. 9.4 పాయింట్లు చల్లా లిఖిత, 9.0 పాయింట్లు వి. తనుజ, 8.8 పాయింట్లు చాట్ల శ్రావణి, యోగిత, సాయి శ్వేత సాధించారు. వీరిని పుష్పగుచ్ఛంతో చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటర్ సిహెచ్.రాము, ప్రిన్సిపాల్ కె.సందీప్, జూనియర్ ప్రిన్సిపాల్ జయప్రకాష్ అభినందించారు.

మాట్లాడుతున్న ఎంపిపి శ్రీరామ్మూర్తి

మండల బడ్జెట్ ఆమోదం

నందిగాం : మండల వార్షిక బడ్జెట్ ఏకగ్రీవంగా ఆమోదించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి నడుపురి శ్రీరామ్మూర్తి అధ్యక్షతన మంగళవారం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. 2025-26కు గాను అంచనా బడ్జెట్ ఆరంభ నిల్వగా రూ.8,20,639, ఆదాయం రూ.45,4,93,000కు గాను, వ్యయం రూ.45,2,77,069 కాగా, మిగులు రూ.10,35,9,79దిగా సూచించారు. వీటిలో 15 శాతం షెడ్యూల్డ్ తరగతులకు, ఆరు శాతం షెడ్యూల్ తెగలకు, 15 శాతం మహిళా శిశు సంక్షేమానికి, 23 శాతం అభివృద్ధి పనులకు, 12 శాతం తాగునీటికి, 15 శాతం కార్యాలయ నిర్వహణకు, పది శాతం మండల సెక్టోరియల్ యాక్టివిటీస్ కోసం నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఎంపిడిఒ టి.రాజా రావు, మండల ఉపాధ్యక్షులు రాగల లక్ష్మీకాంతం, మండల ప్రత్యేకాహ్వానితులు చిన్ని జోగారావు, సభ్యులు ఎర్ర చక్రవర్తి, ఎ.విమలమ్మ, సైలాడ లావణ్య, విలాస రాణి, ఎల్.ధన రాజు, బారి నాన్న, బాలకృష్ణ, కె.పరిణమ్మ, ప్రేమకుమారి, నడుపూరు భానుమతి పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే ఉన్నతస్థాయి సాధ్యం

శ్రీధర్‌కు మెమొంటో అందజేస్తున్న యజమాన్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యార్థులకు కాలం ఎంతో విలువైనదని, కాలాన్ని సద్వినియోగ పరచుకుంటూ ప్రణాళికాబాద్ధంగా చదివితే ఉన్నత స్థానాలకు చేరుకోగలరని వైద్య నిపుణులు దానేటి శ్రీధర్ అభిప్రాయపడ్డారు. నగరంలోని 80అడుగుల రోడ్డులో ఉన్న బృందావనం ఫంక్షన్ హాల్లో కాకినాడఆదిత్య కళాశాల విద్యార్థుల సక్సెస్ మీట్ మంగళవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆర్ఐఒ నాగరాజుతో కలిసి పాల్గొని విద్యార్థులను అభినందించారు. తల్లిదండ్రులు వ్యయప్రయాసల కోర్చి పిల్లలను చదివిస్తూ వారి అభ్యున్నతిని కలలు కంటున్నారని అన్నారు. యువత లక్ష్యాలను విడిచి కాలాన్ని వృథా చేస్తూ కాలక్షేపం చేయడం వల్ల ఎక్కువ శాతం మంది లక్ష్యాలను అందుకోలేక పోతున్నారని అన్నారు. ప్రతి విద్యార్థీ పక్కవారిని చూసి వారిలో మంచిని అన్వయించుకుని వృద్ధిలోకి రావాలన్నారు. 18 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేలు వంతున ప్రోత్సాహకాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపకులు శేషారెడ్డి, డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, ఇతర కళాశాలల ప్రిన్సిపాళ్లు హాజరయ్యారు. అనంతరం విద్యార్థులు ఆటపాటతో సందడి చేశారు. ఈ సందర్భంగా మెడల్స్‌తో సత్కరించారు.

ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు 'తెప్పల'

పలాస : విజయవాడ కెబిఎస్ కళాశాల ఆవరణలో అమరజీవి పొట్టి శ్రీరాములు సభా ప్రాంగణంలో ఈ నెల 28, 29న ఆరో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహిస్తున్నారు. ఆ మహాసభలకు అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.వి.పూర్ణచందు ఆహ్వానం పంపించినట్లు తెప్పల కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. కవితా సదస్సులు, సాంస్కృతిక, విద్యారంగ, భాషోద్యమ సదస్సులు ఉంటాయని, యువతకు ప్రాధాన్యం అధికమని తెలిపారు.

కృష్ణమూర్తి

సభ్యత్వ నమోదులో 'లోతుగెడ్డ' రెండో స్థానం

కొత్తూరు : గత నెలలో టిడిపి సభ్యత నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. టిడిపి నియోజకవర్గ నాయకులు, వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావుకు సభ్యత్వ నమోదులో రిఫరల్‌గా రాష్ట్రస్థాయిలో రెండో స్థానం వచ్చిందన్నారు. పాతపట్నం నియోజకవర్గంలో రిఫరల్‌గా ప్రథమ స్థానం పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త, నాయకులు అభిమానులు ఈనెల ఆఖరు వరకు సభ్యత్వ నమోదు అవకాశం ఉందన్నారు. సభ్యత్వం నమోదు చేసుకోవాలని కోరారు.

చురుగ్గా సిసి రోడ్డు పనులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని మహాదేవిపురంలో రూ.12 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణం ముమ్మరంగా సాగుతున్నాయని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ వి.దుర్గారావు తెలిపారు. ఈ సందర్భంగా సిసి రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులు ఊపందుకుంటున్నాయని అన్నారు. డ్రెయినేజీలు, కాలువల నిర్మాణాలూ చేపడుతున్నామని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉపాధి హామీ నిధులతో అన్ని గ్రామాల్లో సిసి రోడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు.

సిసి రోడ్డును నిర్మిస్తున్న కూలీలు

సొంతింటి కల సాకారం చేసుకోవాలి

ప్రజాశక్తి- బూర్జ

సొంతింటిని నిర్మించుకోవాలనుకునే వారి కలను సాకారం చేసుకోవాలని హౌసింగ్ శాఖ డిఇ పి.సన్యాసిరావు తెలిపారు. మండలంలోని అల్లినలో గృహ నిర్మాణాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్తగా గృహాలు కావలసిన వారికి ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రబుత్వం గడువు ప్రకటించిందని తెలిపారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో ఆముదాలవలస మండలానికి సంబంధించి 172 మంది లబ్ధిదారులు నూతన గృహాల కోసం దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. అలాగే ఆముదాలవలస పట్టణంలో 218 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. బూర్జ మండలంలో 93 మంది, పొందూరు మండలంలో 103 మంది, సరుబుజ్జిలి మండలంలో 167 మొత్తం 753 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. నూతన గృహాలకు రూ.2.50 లక్షలు చొప్పున సబ్సిడీ మొత్తాన్ని మంజూరు చేస్తుందన్నారు. అలాగే గృహ లబ్ధిదారులు సకాలంలో నిర్మించుకోవాలన్నారు. ఆయనతోపాటు గృహ నిర్మాణ శాఖ ఎఇ లక్ష్మీనారాయణ, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాంప్రసాద్, మదన్, పురుషోత్తం ఉన్నారు.

లబ్ధిదారునితో మాట్లాడుతున్న డిఇ సన్యాసిరావు

సామగ్రిని అందజేస్తున్న సభ్యులు

'కెపి స్పందన' ఉదారత

సంతబొమ్మాళి: మండలంలోని బడేకుప్పన్నపేటకు చెందిన కెపి స్పందన ఫౌండేషన్ సభ్యుడు బడే శ్రీనివాసరెడ్డి, రమాదేవి దంపతులు తన తల్లిదండ్రులు దాలినాయుడు, యశోదమ్మల జ్ఞాపకార్థం మంగళవారం ఉదారతను చాటుకున్నారు. పాతపట్నంలో పేద, తల్లిదండ్రులను కోల్పోయి అనాథులుగా జీవిస్తున్న 'నవ జీవన్ నిరాశ్రిత బాలికల ఆశ్రమం'కు వెళ్లి 68 మంది బాలికలకు రూ.25 వేలు విలువైన 12 రకాల లేపనాలు, వస్తువులను, దుప్పట్లను, పర్యావరణ హిత సంచిలో పెట్టి అందజేశారు. పిల్లలు చక్కగా చదువుకుంటే భవిష్యత్ అవసరాలు తీరుస్తామని, సమస్య ఏదైనా సత్వరమే స్పందించి సాయం అందించడమే మా లక్ష్యమని అధ్యక్షులు షణ్ముఖరావు, సర్పంచ్ దుక్క భూషణరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జి.శివారెడ్డి, సిమ్మన్న, చందు, చిరంజీవి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వేషధారణలు

ప్రజాశక్తి- టెక్కలి

క్రిస్టమస్ పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక ఒక్ ల్యాండ్ అంతర్జాతీయ పాఠశాలలో మంగళవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మల్లా మధులత ఆధ్వర్యాన ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు వేసిన వేషధారణలో అలరించాయి. శాంతా క్లాజ్ మేరీ మాత వంటి వేషధారణలు పలువురిని అలరించాయి.

అలాగే స్థానిక రవీంద్ర భారతి పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శాంతా క్లాస్ క్రిస్మస్ మేరీ మాత వేషధారణలతో అలరించారు. క్రిస్మస్ వేడుకలు సర్వమత సమ్మేళానికి నిదర్శనమని పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.పద్మజ తెలిపారు. డీన్ నాగరాజు మాట్లాడుతూ విద్యార్థి స్థాయి నుంచి మతసామరస్యాన్ని పెంపొందించాలని కోరారు.

నరసన్నపేట : స్థానిక రవీంద్రభారతిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో చైర్మన్ ఎం.ఎస్.మణి, నార్త్ ఆంధ్రా జోనల్ ఇన్‌ఛార్జి ఎన్.వెంకటేష్, సిజిఎంజిఆర్ వసంత్, ప్రిన్సిపాల్ ధర్మాన వాసుదేవరావు పాల్గొన్నారు. చిన్నారులు ధరించిన శాంతా క్లాజ్, మేరీ, జోసెఫ్ వేషధారణలు ఆహుతులను అలరించాయి.

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీలోని జ్ఞాన భారతి పాఠశాలలో కార్యదర్శి జోహార్‌ఖాన్ ఆధ్వర్యాన క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఇందు భూషణ్‌పండా, హెడ్ మిస్ట్రెస్ రషీదా సుల్తానా, జోష్‌కుమార్, ఎంపిటిసి మాజీ సభ్యులు లోపిటి నారాయణరావు, ప్రసాద్, ఎస్.రామారావు, గురుమూర్తి, శ్రీను, రాధ పాల్గొన్నారు.

టెక్కలి : వేషధారణలో రవీంద్రభారతి విద్యార్థులు

టెక్కలి రూరల్ : టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్లు, అసోసియేట్ డీన్లు, హెచ్‌డిలు, కెరీర్ గైడెన్స్ సెల్ ఇన్‌ఛార్జీలు డాక్టర్ డి.యుగంధర్ పాల్గొన్నారు.

ఆస్పత్రి సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో అనేక సమస్యలతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలని సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి ఇమాండ్ చేశారు. ఈ మేరకు ఆస్పత్రిని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సరిపడ వైద్య సిబ్బంది లేకపోవడంతో సక్రమంగా వైద్యం అందడం లేదని అన్నారు. రోగులకు సకాలంలో భోజనం అందించడం లేదని తన దృష్టికి వచ్చిందన్నారు. జనరేటర్ అందుబాటులో ఉంచాలన్నారు. ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేసినా పనిడం లేదన్నారు. ఆక్సిజన్ సిలిండర్లపై ఆధారపడే పరిస్థితి నెలకొందన్నారు. గత ప్రభుత్వంలో అనుమతి ఇచ్చిన డయాలసిస్ కేంద్రం పనులు ఇంచుమించు పూర్తయ్యాయని, త్వరలో ప్రారంభించి రోగులకు సేవలను అందుబాటులోకి తేవాలని సూచించారు.

పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- పోలాకి

మండలంలోని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మంగళవారం పలు కుటుంబాలను పరామర్శించారు. టిడిపి మండల నాయకులు బట్న రాము తలకు దెబ్బ తగిలింది. ఆయనను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చింతు రామారావు, కోట పొట్టెయ్యలు అనారోగ్యంతో మృతి చెందారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పోలాకి వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భైరి భాస్కరరావు, మాజీ సర్పంచ్ లుకలాపు రాంబాబు, బోర శ్రీను, వెంకటరమణ, అప్పోజి, దాస్ పాల్గొన్నారు.

వీఆర్‌ఒల సంఘ కార్యవర్గం ఏకగ్రీవం

ప్రజాశక్తి- పాతపట్నం

మండలంలోని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఎన్నిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సంఘంలో ఏడుగురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీఆర్‌ఒల మండల సంఘం అధ్యక్షునిగా బడ్డుమరి పంచాయతీ వీఆర్‌ఒ బి. మురళీకృష్ణంనాయుడు, సెక్రటరీగా ఎం.అలేఖ్య, ఉపాధ్యక్షునిగా శ్రావణి, ట్రెజరర్‌గా కె.శ్యామల్ వాస్లి, జాయింట్ సెక్రెటరీ సునీల్ కుమార్, డివిజనల్ కమిటీ మెంబర్‌గా బి.అన్నాజీరావు, జిల్లా కమిటీ మెంబర్‌గా కె.ఈశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నియామకపత్రం అందజేస్తున్న ఎంపిడిఒ రామకృష్ణ

కార్యదర్శుల మండల అధ్యక్షునిగా మోహన్ గణేష్

ప్రజాశక్తి- జి.సిగడాం

కార్యదర్శుల మండల యూనియన్ అధ్యక్షునిగా అపురభుక్త మోహన్ గణేష్ ఎన్నికయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ రామకృష్ణ అధ్యక్షతన కార్యదర్శుల గ్రేడ్-6 యూనియన్ మెంబర్ల నియామకం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలో యూనియన్ అధ్యక్షునిగా మోహన్ గణేష్, కార్యదర్శిగా పొగిరి రాము, కోశాధికారి పిన్నిటి చక్రధర్, అసోసియేషన్ మెబర్‌గా తోలపు సాయికుమార్, పొన్నాడ శ్రావణభార్గవి, జడ్డు సంతోష్‌కుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎంపిడిఒ నియామకపత్రాన్ని అందజేశారు.

నిరసన తెలుపుతున్న మహిళలు

మహిళల నిరసన

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి పంచాయతీ పరిధి ఎన్‌టిఆర్ కాలనీలో నివసిస్తున్న గృహ దారులకు రోడ్డు సౌకర్యం కల్పించాలని మహిళలు కోరారు. ఈ మేరకు గ్రామంలో మంగళవారం నిరసన తెలిపారు. కొన్నేళ్ల నుంచి తమకు రోడ్డు మార్గం లేక అవస్థలు పడుతున్నామని అన్నారు. గతంలో ఆదిత్య కళ్యాణమండపం పక్క నుంచి మార్గం ఉండేదని, దానిని దేవాదయశాఖ అధికారులు మూసివేశారని అన్నారు. పోలీస్‌స్టేషన్ పక్క నుంచి కూడా మార్గం ఉండేదని, దానినీ పోలీసులు మూసేశారని తెలిపారు. దీంతో రహదారి సౌకర్యం లేకుండాపోయిందన్నారు. తమ ఇల్లలకు చేరుకోవాలని అనుకుంటే చుట్టూ తిరిగి ప్రయాణం చేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర సమయాల్లో ఇబ్బందులకు గురవుతున్నామని వారు వాపోయారు. ఈ ప్రాంతంలో సుమారు 50 నుంచి 70 మంది వరకు కుటుంబాలు జీవిస్తున్నాయని, వీరందరికీ రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని చెప్పారు. పాలకులు, అధికారులు స్పందించి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు.

విద్యార్థులకు అండగా...

ప్రజాశక్తి- కవిటి

సమగ్ర శిక్ష ఆధ్వర్యాన వికలాంగ విద్యార్థులకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని ఎంఇఒలు ధనుంజయ మజ్జి, చిట్టిబాబు అన్నారు. సమగ్ర శిక్ష ద్వారా మండలంలో అలవెన్సులు పొందుతున్న వికలాంగ విద్యార్థుల తల్లిదండ్రులతో సోమవారం మాట్లాడారు. వారికి మండలంలోని భవిత కేంద్రాల ద్వారా పొందుతున్న సేవలు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని వికలాంగ విద్యార్థులకు సంబంధించి రూ.2,17,000లు అలవెన్స్ రూపంలో వచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఐఇఆర్‌పి ఎల్.కృష్ణారావు, సిఆర్‌ఎంటిలు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి- పర్లాకిమిడి

నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు వేసుకున్న తమ పంటలు పాడయ్యాయని, రైతులకు నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా సమన్వయ కర్త ముచ్చి బంగారు, సభ్యులు రొక్కం లోకనాథం, ఝుక్య, దొండపాణి రైతో, శ్రీను బెహరా, పైల మురళి, బి.కె.సూద్ర కోరారు. ఈ మేరకుగా కలెక్టర్ రాజేంద్రమింజ్‌ను మంగళవారం కలిసి వేర్వేరుగా వినతిపత్రాలను అందజేశారు. రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. అలాగే 200 రోజులు ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. కౌలు రైతుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడానికి సుస్థిర వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ రైతు బజారు విధానాన్ని రద్దు చేయాలని కోరారు.

ఘనంగా సిపిఐ శత వార్షికోత్సవం

ప్రజాశక్తి- నరసన్నపేట

పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నారాయణరావు

ఘనంగా సిపిఐ శత వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామని జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాసరావు అన్నారు. నరసన్నపేటలో సిపిఐ శత వార్షికోత్సవాల్లో భాగంగా అరుణ పతాకాన్ని సీనియర్ నాయకులు నెయ్యల నారాయణరావు మంగళవారం ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత స్వాతంత్ర సాధనలో సిపిఐ అగ్రగామిగా నిలిచిందన్నారు. దున్నేవానికి భూమి దక్కాలంటూ ఉద్యమం చేసిందని, భూ సంస్కరణల చట్టం కోసం పోరాడి లక్షలాది ఎకరాలు భూ పంపిణీ చేసిందని అన్నారు. కార్మిక చట్టాలు, హక్కుల సాధనకు, కనీస వేతనాల అమలకు సిపిఐ పోరాడిందన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు నెయ్యల మధుసూదనరావు, సింహాద్రి భాస్కరరావు, వసంతరావు, మోహన్, రాములమ్మ, దశరథ, దాలిశెట్టి పాల్గొన్నారు.

విస్తృతంగా టిడిపి సభ్యత్వం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

టిడిపి సభ్యత్వం తీసుకున్న వారికి రూ. ఐదు లక్షలు ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు టిడిపి మండల నాయకులు వంక రామారావు అన్నారు. మండలంలోని పల్లివూరు పంచాయతీలో మంగళవారం టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సభ్యత్వ రుసుం రూ.వంద కడితే చాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి మాజీ సభ్యులు మరిపింటి పాపారావు, లండ వాసు, నూకల తులసీరావు పాల్గొన్నారు.

లావేరు : మండలంలోని లావేటిపాళంలో ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు యినపకుర్తి రమణ, లంకలపల్లి అచ్యుతరావు, నరేష్, యినపకుర్తి సీతారామరాజు, లంకలపల్లి గోవిందరావు పాల్గొన్నారు.

లావేరు : సభ్యత్వ నమోదు చేస్తున్న తోటయ్యదొర

పరికరాలను పంపిణీ చేస్తున్న సునీల్ కుమార్

పరికరాల పంపిణీ

పలాస : మండలంలోని రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ ఫ్లోరోసిస్ నివారణ కార్యక్రమంలో భాగంగా ఫ్లోరోసిస్ బాధితులకు రిహేబిలిటేషన్ (పునరావాస పరికరాలు)లను వైద్యాధికారి సునీల్ కుమార్ మంగళవారం పంపిణీ చేశారు. గ్రామాల్లో ఫ్లోరోసిస్ ప్రభావిత ప్రాంతాల్లో, గ్రామాల్లో సర్వే నిర్వహించి వివిధ రకాలై ఫ్లోరోసిస్ అనుమాదాస్పద బాధితులను గుర్తించి వారికి మూత్ర, రక్త పరీక్షలను సేకరించి వాటిని జిల్లా కేంద్రానికి పంపించి నిర్ధారించామన్నారు. అవసరమైన వారికి పునరావాస సహాయక చర్యలు చేపట్టి అవసరమైన వారికి అవసరమైన వారికి స్టిక్స్, వాకర్స్, లంబార్ బెల్ట్ పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ లఖినాన అరుణజ్యోతి, ఎన్.సత్యవతి, హెచ్.వి.ఈశ్వరమ్మ, మేరీబాయ్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటాచలంకు అవార్డు

ప్రజాశక్తి- పలాస

విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం జాతీయ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా లఖినాన వెంకటాచలంకు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు కమిషనర్ జి.వీరపాండ్యన్ చేతుల మీదుగా రాష్ట్ర కన్స్యూమర్ అవార్డును అందుకున్నారు. వెంకటాచలం నందిగాం మండల వినియోగదారుల సంఘం అధ్యక్షునిగా, రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య వైస్‌చైర్మన్‌గా, జిల్లా వినియోగదారుల క్లబ్‌ల మాస్టర్ ట్రైనీగా రెండేళ్ల నుంచి వ్యవహరిస్తున్నారు. విద్యార్థులను చైతన్య పరుస్తూ పలు కార్యక్రమాలు చేస్తున్నారు. ఈ అవార్డు లభించడంపై జిల్లా వినియోగదాల సంఘాల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు బగాతి రామ్మోహనరావు, బమ్మిడి నరేంద్రకుమార్, పౌరసరఫరాల అధికారి జి.సూర్యప్రకాశరావు, దువ్వాడ జనార్ధనరావు, ఉప్పాడ రమేష్ అభినందనలు తెలిపారు.

అవార్డు అందుకుంటున్న వెంకటాచలం